www.prajavoice.in

# ప్రజా వాయిస్

తెలుగు డిజిటల్ దిన పత్రిక

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

Contact:- 9849343720

/ PRAJA VOICE

సంపుటి : 1 | సంచిక : 54 | ఎడిటర్ : మేనం శ్యామ్ | మంగళవారం 12-8-2025 | పేజీలు : 4

## సిరా చుక్క

ఈ లోకంలో నువ్వు, నేను ఎవరు శాశ్వతం కాదు మిత్రమా !
రేపటికి రూపం లేని రోజు కొరకు ఎందుకు అత్యాశ !
ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో తెలియని ఈ రోజులలో,
నువ్వు ఎంత సంపాదించిన, ఎంత ఎత్తుకు ఎదిగిన చివరకు నిన్ను మోసేది నలుగురే కదా !
లక్షలు, కోట్లు కూడబెట్టిన మరణం తర్వాత కాటిలోన తినలేవు !
ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణాన్ని అలవాటు చేసుకో !
సాటివాడిని ఆదరించి, అక్కున చేర్చుకో !

రమేష్ గాండ్ల

ప్రజా వాయిస్
ఇది ప్రజల గొంతుక

# ఏం చేద్దాం



### బీసీ రిజర్వేషన్లపై పార్టీ పరంగా 42% ప్రకటించి ముందుకెళ్దామా?

### కోర్టును మరింత సమయం కోరదామా?

### రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ భేటీలో చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 11:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయించారు. ఈ నెల 16 లేదా 17న పీఏసీ సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. మహేశ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై చర్చించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు కోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఎలా ముందుకువెళ్లాలన్నదానిపై సమాలోచనలు జరిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు, పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ తెచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశం చర్చకు వచ్చింది. ఈ విషయాన్ని కోర్టుకు నివేదించి.. స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొంత గడువు కోరితే ఎలా ఉంటుందన్న విషయంపై నేతలిద్దరూ చర్చించారు. కోర్టు అనుమతిస్తే కేంద్రంపై మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. అలా కాకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 42% రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లుగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్లడంపైనా చర్చించారు. పీఏసీ సమావేశం తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత రానుంది. పార్టీ పరంగా బీసీలకు 42% రిజర్వేషన్ ప్రకటించి, ముందుకు వెళ్లాలని పీఏసీలో నిర్ణయం తీసుకుంటే.. సెప్టెంబరు 10 తర్వాత స్థానిక ఎన్నికలు ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ లోపు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్ నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ స్థాయి పరిశీలకులు.. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి నియోజకవర్గానికి రెండు పేర్లతో ఇచ్చిన ప్రతిపాదనలు సీఎం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ముందే ఈ పోస్టులను భర్తీ చేసి, కార్యకర్తల్లో కదలిక తీసుకురావాలన్న ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు.

**జూబ్లీహిల్స్ అభ్యర్థిపై మరో సర్వే!**

గెలుపే ప్రాతిపదికగా, సర్వేల ఆధారంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైన ఈ ఉప ఎన్నికలో అభ్యర్థిపై ఎలాంటి ఒత్తిడికీ తావు లేకుండా.. సర్వేల ఆధారంగానే నిర్ణయానికి రావాలని అనుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీల వారీగా జరిగిన సర్వేలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం ప్రస్తుతం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత నవీన్ యాదవ్, రెహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరి అభ్యర్థిత్వాలపై పార్టీసర్వే జరుగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖల వారీగా సమీక్షించారు. జనహిత పాదయాత్రల ద్వారా వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలిద్దరూ నిర్ణయించారు. ఈ నెల 23 నుంచి పాదయాత్రను పునఃప్రారంభిస్తున్నామని, యాత్రలో ఒక రోజు పాల్గొనాలని సీఎం రేవంత్‌ను మహేశ్‌గౌడ్ కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## 14న నెక్లెస్ రోడ్డులో భారీ తిరంగా ర్యాలీ

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 14న ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్డులో కళాశాల విద్యార్థులతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు గడచిన ఐదేళ్లుగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీపరంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి. మనోహర్‌రెడ్డి చైర్మన్‌గా, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, అధికార ప్రతినిధి రాణి రుద్రమ, బీజేవైఎం అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ సభ్యులుగా ఏర్పాటయిన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగాలో భాగంగా 40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేస్తామన్నారు. విభజన సందర్భంగా చోటు చేసుకున్న విషాద ఘట్టాలను తెలియజేసేందుకు 14న విభజన దినంగా పరిగణిస్తామని, ఈ సందర్భంగా మౌన ర్యాలీలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు వివరించారు.

## అప్పుపై కాంగ్రెస్‌వి పచ్చి అబద్ధాలు

ఇదే విషయం పార్లమెంట్ సాక్షిగా తేలిపోయింది
కాగ్ నివేదికతో రాష్ట్ర ఆర్థికస్థితి తలకిందులైందని స్పష్టీకరణ
అప్పులతో ఏం చేస్తున్నారు? ? కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 11:** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన బృందం చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలు అనే సంగతి పార్లమెంటులో తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నట్టుగా తమ హయాంలో రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల కాదని, రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకొందన్నారు. ఈ మేరకు కేటీఆర్ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులంటూ నిరాధార ప్రచారానికి దిగిన రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారు? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# కదం తొక్కిన విపక్షం

## ఓట్ల చోరీ, ఎస్ఐఆర్‌పై 300 మంది ఎంపీల నిరసన

పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి.. ఇండియా కూటమి ఎంపీల భారీ నిరసన ప్రదర్శన
ర్యాలీలో పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు
మధ్యలోనే అడ్డుకుని నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన మహిళా ఎంపీలు
పోలీసులతో వాగ్వాదం.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పలువురు నేతల అరెసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కదం తొక్కారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం నిరసన చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి ఈసీ కార్యాలయం దాకా ఎంపీలు ప్రదర్శన చేపట్టగా.. వారిని ఢిల్లీ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు నేతలు బారికేడ్లు ఎక్కి ముందుకెళ్లే యత్నం చేయడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరు మహిళా ఎంపీలు కళ్లుతిరిగి పడిపోయారు. ఎంపీల శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పలువురు నేతలు మండిపడ్డారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశం కాగానే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలి.. ఓట్ల చోరీని నిలిపివేయాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో సభలు వాయిదా పడ్డాయి. అనంతరం ఉభయ సభలకు చెందిన దాదాపు 300 మంది ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఎంపీ ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్, ఎన్సీపీ-ఎస్పీ నేత శరద్‌పవార్, శివసేన నేతలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, డీఎంకే నేత టీఆర్ బాలు, తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ సహా ఆర్జేడీ, లెఫ్ట్, ఆప్ నేతలు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై బీజేపీని గెలిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి బయలుదేరి ప్రదర్శనగా వెళుతుండగా.. పోలీసులు అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళా ఎంపీలు మహువా మోయిత్రా, సంజనా జాదవ్, జ్యోతిమణి, ఎన్సీపీ నేత సుప్రియా సూలే.. బారికేడ్ల పైకెక్కి ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ.. నిరసన జరిగినంతసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ వాద్రా, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది సహా పలువురిని పోలీసులు బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ వీధిలో ఉన్న పోలీసస్టేషన్‌కు తరలించారు.



## కేసీఆర్, కేటీఆర్ కన్నా జగదీశ్ రెడ్డే ఎక్కువ సంపాదించారు

కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ఎకరా రూ.50 లక్షలు
జగదీశ్‌రెడ్డి ఫాంహౌస్ వద్ద ఎకరా రూ.40 కోట్లు
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 11:** ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గర్లో షాబాద్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి 80ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇక్కడ ఎకరం ధర రూ. 40కోట్ల నుంచి రూ. 50కోట్లు ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్, కేటీఆర్ కంటే జగదీశ్ రెడ్డే ఎక్కువ ఆస్తులు సంపాదించారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో ఆయన గురువును మించిన శిష్యుడన్నారు. కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ఎకరం రూ. 50లక్షలు ఉంటే, జగదీశ్‌రెడ్డి ఫాంహౌస్ దగ్గర రూ. 40కోట్లు అని వివరించారు.

# బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతి వద్దకు

### కాళేశ్వరం, బనకచర్లపై సుప్రీంకోర్టుకు?

### 14న కరీంనగర్ బీసీ సభపై దృష్టి పెట్టండి

### కేటీఆర్, హరీశ్, వినోద్‌తో భేటీలో కేసీఆర్ జ్వరంతో బాధపడుతున్న బీఆర్ఎస్ చీఫ్?



**గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 11:** బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ కూడా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పార్టీ అధినేత కేసీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌసలో జరిగిన సమావేశంలో 'బీసీ రిజర్వేషన్ల కార్యాచరణ'పై చర్చించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయమై ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయడంపై దృష్టి సారించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో అవసరమైతే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని, బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్, హరీశ్‌రావులను ఆదేశించినట్లు తెలిసింది. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలోనూ కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని, బనకచర్లపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు తెలియజేయాలని.. అవసరమైతే ఈ రెండు అంశాలపై సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై పరిశీలించాలని చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. నెల రోజుల క్రితం యశోద ఆస్పత్రితో పాటు ఏఐజీలో చికిత్స పొందిన ఆయనకు తాజాగా మళ్లీ జ్వరం వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో మరోసారి ఆస్పత్రిలో చేరి, చికిత్స తీసుకోనున్నట్లు తెలిసింది. అక్కడి నుంచే కేసీఆర్ కరీంనగర్ బీసీ సభకు వె ళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ సభ ఏర్పాట్లపై ఎంపీ వినోద్‌కు పలు సూచన లు చేసినట్లు తెలిసింది.

## అణుబూచి పాక్‌కు మామూలే

### పాక్ ఆర్మీ చీఫ్ బెదిరింపులపై భారత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అణ్వస్త్ర బెదిరింపులు పాకిస్థాన్‌కు మామూలేనని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటన సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. "మా ఉనికికే ప్రమాదం ఏర్పడితే.. భారత్‌పై అణుదాడి చేస్తాం. మేం మునిగిపోతూ.. సగం ప్రపంచాన్ని వెంట తీసుకెళ్తాం" అంటూ మునీర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే..! స్నేహపూర్వక దేశమైన అమెరికా గడ్డ పైనుంచి మునీర్ వ్యాఖ్యలు రావడం విచారకరమని భారత విదేశాంగ శాఖ తెలిపింది. "పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యల ద్వారా ఆ దేశంలో అణ్వస్త్రాల నియంత్రణ, కమాండ్ వ్యవస్థ నైతికతపై ఉన్న అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఉగ్రవాద గ్రూపులతో పాక్ సైన్యం కలిపి పనిచేస్తోందన్న వాస్తవం మరోసారి స్పష్టమవుతోంది. అణ్వస్త్ర బ్లాక్ మెయిల్‌కి భారత్ తలొగ్గదు. అదే సమయంలో.. జాతీయ భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది" అని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా మునీర్ వ్యాఖ్యలు బాధ్యతారహితానికి నిదర్శనమని పేర్కొన్నట్లు పీటీఐ తెలిపింది. పాక్ సైన్యానికి అమెరికా మద్దతిస్తే.. పాక్ తన అసలు స్వరూపాన్ని, దూకుడును బయటపెడుతోందని పేర్కొంది.

# పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలి

**- కామారెడ్డి కలెక్టరేట్ ముందు గురుకులాల సప్లై కాంట్రాక్టర్ల నిరసన**

**- నాలుగు నెలలుగా బిల్లులు నో - 1093 గురుకులాలకు 5465 కోట్ల రూపాయల బకాయిలు**



**కామారెడ్డి,ప్రజా వాయిస్**
తెలంగాణలోని గురుకులకు కిరాణా వస్తువులు, కూరగాయలు, మటన్, చికెన్ గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని కామారెడ్డి కలెక్టర్ ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు.వెజిటబుల్, ప్రొవిజన్స్ సప్లై అసోసియేషన్ సభ్యుల బిల్లులు రావడం లేదని కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి ఆగ్రహించారు.కామారెడ్డి జిల్లాలోని ఆయా గురుకుల పాఠశాలల్లో వెజిటేబుల్స్ ప్రొవిజన్స్ సప్లై అసోసియేషన్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించి కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. గురుకులాలకు నూతన టెండర్ విధానం వద్దు, పాత టెండర్ విధానం ని అమలు చేయాలి అనే డిమాండ్ తో జిల్లా కలెక్టర్ ను కలిసితమ గోడు ను వెళ్ళబోసుకున్నారు. అనంతరం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర జిల్లా వ్యాప్తంగా గురుకుల పాఠశాలలకు కూరగాయలు పండ్లు ఆహార పదార్థాల ముడి సరుకులు అందజేసే కాంట్రాక్టర్లు గురుకుల పాఠశాలలో పాత టెండర్ విధానాన్ని అమలు పరచాలని లేనియెడల 13వ తారీకు నుండి పాఠశాలలకు అందజేయాల్సిన ముడి సరుకులు నిలిపివేస్తామని వినతి పత్రం అందజేశారు. గత నాలుగు నెలల నుండి వారికి ఎటువంటి బిల్లులు రావడం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని కొత్త టెండర్ విధానంలో చాలా కఠిన నియమ నిబంధనలు చాలా ఉన్నాయని వాటిని అనుసరించి వస్తువులను సరఫరా చేసే ఆర్థిక స్తోమత లేదని పాత టెండర్ విధానాన్ని అవలంబించి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి మూడుసార్లు సప్లై చేయాల్సిందిగా వచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని లేని ఎడల ఈనెల 13 నుండి గురుకుల పాఠశాలలకు కూరగాయలు ముడి సరుకులతో పాటు పాలు పండ్లు నిలిపివేసి నిరసన తెలియజేస్తామన్నారు. గత 4 నెలల నుండి తమకు రావాల్సిన బకాయిలు రావడం లేదని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల 1093 గురుకులాలకు 5465 కోట్ల రూపాయల బిల్లులు ప్రభుత్వం బకాయి ఉందని పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాంట్రాక్టర్లు వాపోయారు. ఒక్కో గురుకులానికి కిరాణం మటన్ చికెన్ పాలు కిరాణం వస్తువులు ఐదు లక్షల రూపాయల బకాయి ఉందని పేర్కొన్నారు. కోట్ల రూపాయల పాత బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం తమ పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తో పాటు నవీన్, శ్రీనివాస్, హిభాదుల్లా, రమేష్, కుమారస్వామి, బాలకిషన్, వినోద్, మటన్ కిషన్, పాల్గొన్నారు.

# అనర్హులను తొలగించి అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలి

**- కామారెడ్డి కలెక్టరేట్ ముందు బాధితుల నిరసన - సిపిఎం జిల్లా కార్యదర్శి కె చంద్రశేఖర్**



**కామారెడ్డి,ప్రజా వాయిస్**
కామారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీలో అనర్హులకు ఇల్లు కేటాయించారని కామారెడ్డి కలెక్టరేట్ ముందు డబుల్ బెడ్ రూమ్ బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా బిక్నూర్ మండల కేంద్రంలో జరిగిన ఇండ్ల పంపిణీలో అనర్హులుఉన్నారని అధికారులు రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ నిజమైన అర్హులకు కేటాయించకుండా అనర్హులకు ఇల్లు కేటాయించారని జిల్లా కలెక్టర్ కి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ హౌసింగ్ జిల్లా అధికారిని వెంటనే రీ ఎంక్వయిరీ చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ఏ విధంగా జరిగిందో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. బిక్నూర్ గ్రామస్తులు అంత ఇండ్లలో ఉంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇళ్ల స్థలాల కోసం ఆందోళన పోరాటాలు కొనసాగించాలని అర్హులకు ఇవ్వకుండా ఇండ్లున్నవారికి ఉద్యోగులకు కేటాయించడం సరైంది కాదన్నారు. ప్రస్తుత కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం అభ్యంతరం తెలిపినట్టు ఆయన గుర్తు చేశారు. అర్హులైన పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు. నాయకులు రహిమ హైమది బేగం పుష్ప లక్ష్మి మంజుల భాష లక్ష్మి నజియా తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తా.. లేదా మద్యం మత్తా


**- గంట్లవెల్లి ప్రభుత్వ పాఠశాలపై దాడి**

**- కిటికీలు,ఫ్యాన్లు, రికార్డ్ లు ధ్వంసం - నెలరోజులలో రెండవసారి పట్టించుకోని సంబంధిత అధికారులు**

**- పోలీస్ లకు పిర్యాదు చేయకపోవడం వెనుక మర్మమేంటి - బడికి పంపడానికి తలడిల్లుతున్న విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు**



**ప్రజా వాయిస్,షాద్ నగర్**
చిల్లరి మూకలు చేసిన పనా,గంజాయి మత్తులో చేసిన పనా,మద్యం మత్తులో చేసిన పనా గ్రామస్తులు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంలో జాప్యం చేస్తున్నారు.అక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాల పైన దాడి జరిగితే కనీసం నోరు మెదపడం లేదు ఎందుకు. ఇవన్నీ అక్కడ ఉన్న స్థానిక ప్రజలకు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు తెలిసే జరుగుతున్నదా. తెలిసి జరిగితే అక్కడ ప్రభుత్వ పాఠశాల ఎందుకు ఆ పాఠశాలను మూసివేసి వేరే చోట పాఠశాలను తెరవాల్సిన అవసరం ఏమైనా ఉన్నదా. ప్రభుత్వ సొమ్ముకు నష్టం జరిగితే ఎందుకీ నిర్లక్ష్యం ఎవరికోసం,ఎవరిని కాపాడడం కోసం ఈనిర్లక్ష్య ధోరణి.ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు కొమ్ముకాస్తున్నారు ఈప్రభుత్వ ఉద్యోగులు.నిద్రవస్థలో మండల విద్యాధికారి,జిల్లా విద్యాధికారులు ఉన్నారా అనే ప్రశ్నలకు సమాధానం తెలియాల్సిన అవసరం ఉన్నదని చెప్పకనే చెప్పాలి.పూర్తి వివరాల్లోకి వెళితేఫరూక్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను గుర్తు తెలియని చిల్లర జులాయులు మళ్లీ టార్గెట్ చేశారా అంటే అవుననే చెప్పాలి.శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఆదివారం రాత్రి పాఠశాల తాళం పగులగొట్టి ఫ్యాన్లు విరగొట్టిన ఘటన చోటుచేసుకుంది.గత నెల రోజుల క్రితం కూడా ఇదే తరహాలో ఫ్యాన్లు, కిటికీలు, పాఠశాల రికార్డులు ధ్వంసం చేసిన ఘటనతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. గ్రామ పెద్దలు, విద్యావంతులు ఈసారి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.విద్యాసంస్థలపై ఇలాంటి దుర్మార్గపు చర్యలు అంగీకారయోగ్యం కాదని గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు, పోలీసులు తక్షణమే చర్యలు



తీసుకొని నిందితులకు కఠిన శిక్ష విధించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.



# విద్యార్థుల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

**- 6196 విద్యార్థులకు మాత్రలు కవరేజ్ - ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం వెంకట దాస్**



**నాగర్ కర్నూల్,ప్రజా వాయిస్**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా నులిపురుగుల నివారణకువిద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం నాగర్ కర్నూల్ డివిజన్ లో బిజినపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్ విద్యార్థులకు ఆల్బెండజోలు మాత్రలు విద్యార్థులకు వేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యొక్క వ్యక్తిగత ఆరోగ్యం లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా చొరవ తీసుకొని నులి పురుగులు,ఏలిక పాములు, కొంకి పురుగులు నివారణ కు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు.బిజినపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బిజినపల్లి పరిధిలో 6196 విద్యార్థులకు మాత్రలు 91.07శాతం,17 గ్రామాలలో 35 పాఠశాలలు 24 అంగన్వాడి కేంద్రాల్లో అరులైన విద్యార్థులు అందరికీ వేసినట్లు ఆయన తెలిపారు.లట్టుపల్లి వైద్యాధికారి డాక్టర్ టి.ప్రసన్న మాట్లాడుతూ మంగనూరు,గంగారం, లట్టుపల్లి, ఎర్రకుంట తండా ఆరోగ్య ఉప కేంద్ర పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో అర్హులైన చిన్నారులందరికీ ఆల్బెండజోళ్ళు మాత్రలు వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తేజస్విని,డాక్టర్ మేఘనా రెడ్డి,ఆరోగ్య విస్తీర్ణ అధికారి రమేష్ కుమార్,ఆరోగ్య పర్యవేక్షకులు అశోక్ కుమార్,బాలమణి,శశికళ, తామర , క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..



# ఇసుక మాఫియా దోపిడిని అరికట్టండి

**ఆర్డీవో చొరవ తీసుకోవాలి**

**బిఎస్పీ పార్టీ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్**




**హుస్నాబాద్: ప్రజా వాయిస్**
హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుక తక్కువ ధరకు అందించాలని ప్రభుత్వం ఒక ట్రాక్టర్ టిప్పుకు 1400/- రూపాయలు ఇచ్చేందుకు మైనింగ్ శాఖ కు అనుమతులు ఇవ్వడం జరిగింది. హుస్నాబాద్ పట్టణంలో మొదటి విడతలో 144 ఇండ్లు రావడం జరిగింది. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బేస్మెంట్ లేవల్ వరకు కనీసం మూడు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక అవసరం ఉంటుంది. ఇట్టి ఇసుకకు ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు 6000 రూపాయలు ఇసుక మాఫియా దోపిడీ చేయడం జరుగుతుంది. హుస్నాబాద్ చుట్టుపక్కల, పట్టణంలో ఇసుక డంపులు చేసి అధికారుల అండదండలతోనే ఇల్లు కట్టుకునే పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నారు. మంత్రి పొన్నముకు సమీపంగా ఉన్నవారు కూడా ఈ దందాలో పాత్ర ఉన్నట్టు తెలుస్తుంది. వెంటనే ఇట్టి విషయంలో ఆర్డీఓ గారు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా బిఎస్పి పార్టీ పక్షాన కోరడం జరుగుతుంది. లేకపోతే బీఎస్పీ పార్టీ పేదల పక్షాన ఆర్డీఓ ఆఫీస్ వద్ద ఆందోళన చర్యలు చేపడతామని హెచ్చరించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు మారిశెట్టి సుధాకర్ ఎలగందుల శంకర్, జిల్లా ఇన్చార్జ్ దేగల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, హుస్నాబాద్ మండల అధ్యక్షులు దుంద్ర రాంబాబు తదితరులు ఉన్నారు.

# ఆగస్టు 13లోగా రైతు బీమాకు దరఖాస్తులకు చేసుకోండి

**- దుగ్గేపల్లి క్లస్టర్ ఏఈఓ అబ్దుల్ సమీ**

**ప్రజా వాయిస్,త్రిపురారం**



తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 13, 2025 లోగా రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని దుగ్గేపల్లి క్లస్టర్ ఏఈఓ అబ్దుల్ సమీ కోరారు. కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందినవారు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 5 లోగా పట్టా పాస్ బుక్కులు వచ్చినవారు, ఇంత వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకొని వారు, మాత్రమే రైతు బీమాకు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. రైతు బీమాకు దరఖాస్తులు చేసుకునేవారు

1- దరఖాస్తు ఫారం,
2- రైతు పట్టాదారు పాస్ పుస్తకం, తహశీల్దార్ డిజిటల్ డిఎస్ పేపర్,
3- రైతు ఆధార్ కార్డు జిరాక్స్,
4- నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లతో నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు "రైతుల వయస్సు ఆగస్టు 14, 1966 నుండి ఆగస్టు 14, 2007 సంవత్సరం మధ్య జన్మించి ఉండాలని, ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నిండి ఉండి 50 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారికి మాత్రమే రైతు బీమా వర్తిస్తుందన్నారు" కాబట్టి పూర్తి వివరాలతో నిర్ణీత సమయానికి ముందు రైతు బీమా దరఖాస్తులు ఇవ్వాలని ఆయన కోరారు.

# అంతర్జాతీయ కరాటేలో మేడల్స్ సాధించిన విద్యార్థులు

**అభినందనలు తెలిపిన స్కూల్ ప్రిన్సిపల్ తులసి**

**ప్రతిఒక్కరి జీవితంలో కరాటే భాగం కావాలి మాస్టర్ సాయినాథ్ యాదవ్**



**ప్రజా వాయిస్,షాద్ నగర్**
కర్ణాటకలోని షిమోగో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మౌలే షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో షాద్ నగర్ కు చెందిన యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు రిషికేశ్,గోకుల్ నందన్ లు కథాస్ లో గోల్డ్ మెడల్,కుమిటిలో రెండు బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈసందర్బంగా ఢిల్లీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ తులసి అభినందనలు తెలిపారు.అనంతరం యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని మరిన్ని పథకాలు సాదించాలని, ప్రతిఒక్కరి జీవన విధానంలో కరాటే భాగం కావాలని ఆకాంక్షించారు.

## మహిళలకు రక్షణగా ఉండాలని కొందుర్గు పోలీస్ స్టేషన్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్




**ప్రజా వాయిస్,షాద్ నగర్**
కొందుర్గు పోలీసు స్టేషన్ లో రక్షాబంధన్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ నేడు సమాజంలో స్త్రీలు తీవ్రమైన అణిచివేతకు గురవుతున్నారని వారిని కేవలం వంటింటికే పరిమితం చేయకుండా సమాజంలో వారిని సమానత్వంగా చూడాలి అన్నారు. మనందరం కలిసి వారి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. రాఖీ సందర్భంగా అన్నా చెల్లి అనుబంధం ఎప్పటికీ జీవితాంతం కలిసి ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థినికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, శేఖర్, ప్రశాంత్, మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

**జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**వాగులు పొంగిపొర్లుతున్నాయి అటువైపు ప్రజలు వెళ్లకుండా చూడాలి**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.**

**శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలను ఖాళీ చేయించాలి**

**భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్**




సంగారెడ్డి, ప్రజా వాయిస్
జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ప్రావిణ్య జిల్లాలోని రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మున్సిపల్, పోలీసు ,వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో భారీ వర్షాల నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు... గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు జిల్లాలోని వాగులు వంకలు చెరువులో కుంటలు పొంగిపొర్లుతున్నాయని అటువైపుగా ప్రజలు వెళ్లకుండా అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చెరువుల నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కట్టలు, తూములు తెగే అవకాశాలున్న ప్రాంతాల్లో ముందస్తు గా బారికేట్లు ఏర్పాటుచేయాలని నీటిపారుదల శాఖకు ఆదేశాలు జారీ చేశారు. కాలువలు, చెరువుల్లో పిల్లలు, పెద్దలు ఈతకు వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చోట ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు . విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు ప్రజలు దగ్గరగా వెళ్లకుండా చర్యలు చేపట్టాలని, వర్షాల సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే, కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు పశువులు దగ్గరగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖఅధికారులను ఆదేశించారు . భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని. భారీ వర్షాల కారణంగా అంటూ వ్యాధుల ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా అవసరమైన అన్ని రకాల జాగ్రత్త చర్యలు అధికారులు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు అన్ని మండల కేంద్రాలలో మున్సిపల్ కేంద్రాలలో స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని మంజీర పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా రైతాంగం ఆగమాగం అవుతుంది

## ఆవేదనలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

**ఎఎమ్మార్పీ ప్రాజెక్టు ద్వారా రైతన్నకు నిరందడం లేదు**

**జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను ప్రభుత్వం విస్మరించింది**


**గత సంవత్సరం పాడాలు నేర్చుకోకుండా ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం ప్రభుత్వ నిర్లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ కు వినతినిచ్చిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.**



నల్గొండ, ప్రజా వాయిస్
నల్లగొండ కలెక్టరేట్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి ని కలిసి నల్లగొండ జిల్లాలో సాగునీటి సమస్యలపై మరియు నియోజకవర్గంలోని నీటి ప్రాజెక్టులకు నీటి సరఫరాపై వినతి పత్రం అందజేసిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లా రైతులు గత కొన్ని సంవత్సరాలుగా సాగునీటి సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్నారని,ఈసారి పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు.నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండిపోయినా, ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు తగిన నీరు అందకపోవడం అనేది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఏద్దేవాచేశారు.ఏఎమ్మార్పీ నాలుగో మోటార్ (యూనిట్) క్యాపిటల్ ఓవర్హాలింగ్ మరమ్మతు పనులు రెండు నెలల క్రితం ప్రారంభమైనప్పటికీ, సకాలంలో పూర్తిచేయకపోవడం ఘోర వైఫల్యానికి కారణం అన్నారు.జూలైలోనే పూర్తి కావాల్సిన ఈ పనులు ఆగస్టు నెల వచ్చినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని,ఈ ఆలస్యం వలన ప్రస్తుతం మూడు మోటార్ల ద్వారానే 1800 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అవుతోందన్నారు.అందులో 525 క్యూసెక్కులు జంట నగరాలకు, 30 క్యూసెక్కులు మిషన్ భగీరథకు, 1200 క్యూసెక్కులు ఉదయ సముద్రం నింపేందుకు వాడుతున్నారు, దీంతో ఆయకట్టుకు నీరు చేరడం లేదు.ప్రధాన కాల్వ నీటి విడుదలను 1200 క్యూసెక్కుల నుండి 950 క్యూసెక్కులకు తగ్గించడం జరిగింది అలాగే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్కి చేరి, గుడిపల్లి, గుర్రంపోడ్ మండలాల్లో వేల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి.ఇది మాత్రమే కాకుండాశ్రీశైలం ప్రాజెక్టు ద్వారా విడుదలైన నీటిని నిల్వ చేసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హెచ్చరించారు.సరైన ప్రణాళికతో నిల్వ చేసి ఉంటే నల్లగొండ జిల్లాకు ఈ స్థాయి కష్టాలు వచ్చేవి కావని,ఉదయ సముద్రం ప్రాజెక్టుకు 1200 క్యూసెక్కుల నీటిని కేటాయిస్తూనే, అందులో కేవలం 1.2 క్యూసెక్కుల నీటినే తాగునీటి కోసం వినియోగించడం, మిగతా నీటిని సరైన విధంగా పంపిణీ చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసారు.కేవలం 0.5 క్యూసెక్కుల నీటితో బ్రాహ్మణ వెల్లంల, ఉదయ సముద్రం, అయిటిపాముల ప్రాజెక్టులను నింపడం అసాధ్యం అని సాంకేతికంగా తెలిసినా, ప్రభుత్వం ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించిందని,గత సంవత్సరం ఇదే పరిస్థితి ఏర్పడినప్పటికీ పాఠాలు నేర్చుకోకుండా, ఈ సంవత్సరం ముందస్తు ప్రణాళికలు లేకుండా వ్యవహరించడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, అగౌరవాన్ని స్పష్టంగా చూపిస్తోందని,సాగర్లో నీరు సమృద్ధిగా ఉండి కూడా, రైతులు ధర్నాలకు దిగే పరిస్థితి రావడం దురదృష్టకరని,దీనిపై ప్రభుత్వం తక్షణ జోక్యం చేసుకొని ఏఎమ్మార్పీ నాలుగో మోటార్ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూర్తి చేసి మోటార్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చేసి, రోజుకు కనీసం 2400 క్యూసెక్కుల నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని,అన్ని డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లకు సమానంగా సాగునీరు చేరేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని,శ్రీశైలం, ఉదయ సముద్రం నీటి వినియోగంపై సమగ్ర సమీక్ష చేసి, జిల్లాకు గరిష్ట లాభం చేకూరేలా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని,ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల రైతుల ఆగ్రహం రోజురోజుకూ పెరుగుతోందని,తక్షణ చర్యలు తీసుకోవాలని లేని ఎడల జిల్లా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే పరిస్థితి తప్పదని హెచ్చరించారు.

### మెన్నిపాడు వాగుపై వంతెన నిర్మించాలని కలెక్టర్ కి వినతి పత్రం



ప్రజా వాయిస్, గద్వాల్
జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవెల్లి మండల పరిధిలోని మెన్నిపాడు నక్కల వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్లు గడుస్తున్నా కూడా వాగుపై వద్దను నిర్మాణం కొరకు అధికారుల చుట్టూ గ్రామస్తులు తిరుగుతున్న ఇంకా అధికారులు కానీ నాయకులు కానీ స్పందించడం లేదని ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామంలోని ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని సామాజిక కార్యకర్త ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు షాహిన్ గద్వాల్ జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.

# అంబులెన్స్ ఉన్న ఆపదలో రాదు..

**అత్యవసర సమయంలో వెళ్లాము అన్న రోడ్డు లేదు**

**ఇది వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లాలో 108 నిర్వహణ దుస్థితి**

**సకాలంలో 108 రాక ప్రాణాలు కోల్పోయిన యువకుడు**

**ఇలా ఎంతమంది చనిపోవాలి**

**మెంటేన్స్ పేరుతో డబ్బులను దోచుకోవడానికి కాంట్రాక్టర్ల ప్రయత్నం**

**సర్వీసులను ఎందుకు నిలిపిస్తున్నారు ఒక్కసారి పరిశీలించండి**



సంగారెడ్డి, ప్రజా వాయిస్
అత్యవసర సమయంలో పేద ప్రజలను ఆదుకునేందుకుగాను స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 2004లో 108 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటినుంచి ఇప్పటివరకు పేద ప్రజలకు అత్యవసర సమయంలో సేవలందిస్తున్నారు. పాలకులు మారడంతో 108 సేవలను నిర్వహిస్తున్న ఏజెన్సీలు తమ స్వార్థ లాభాల కోసం తప్పుదారి పట్టిస్తున్నారు. ఎక్కడైతే కేటాయిస్తారో ఆ వాహనం అదే ప్రాంతానికి సంబంధించిన రోగులను నిర్దేశించిన ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా ప్రస్తుతం 108 ఏజెన్సీలు పూర్తిస్థాయిలో వాహనాలను వినియోగించుకోకుండా సర్దుబాటు ధరలతో సేవలను కొనసాగిస్తున్నారు. దీనికి నిదర్శనమే ఆదివారం పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎంఆర్ఎఫ్ పరిశ్రమల పనిచేసే ఒక ఉద్యోగి ఎర్రగుల్ల నర్సింలు వ్యక్తిగత కారణాలతో గడ్డి మందు సేవించాడు. దీన్ని గమనించిన స్థానికులు 108 కు సమాచారం అందించారు. దాదాపు మూడు గంటలైనా రాకపోవడంతో చేసేదేమేం లేక ఇద్దరు మిత్రులు కలిసి బైకుపై సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే వైద్యులు అతన్ని పరీక్షించి మృతి చెందిన నిర్ధారించారు. అదే పుల్కల్ కు సంబంధించిన కేటాయించిన 108 వాహనం అందుబాటులో ఉండి ఉంటే ఆ యువకుడి ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేది. కానీ ఉదయం 8 గంటలకు సంగారెడ్డికి వెళ్లిన 108 వాహనం సాయంత్రమైనా కూడా పుల్కల్ ఆసుపత్రికి రాలేకపోయింది. ఈ మండలానికి అయితే కేటాయించిన వాహనం అదే మండలంలో ఉండాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఏజెన్సీల కు కొమ్ముకాసే అధికారులు వారి నుంచి నెలవారి మామూలు తీసుకొని పూర్తిస్థాయిలో నడవకుండా సర్వీసులను నిలిపి వేస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో అయితే అడ్జస్టెంట్ ల( సర్దుబాట్ల) కింద విధులు సిబ్బందిచే పనులు తీసుకుంటున్నారు. దీనికి నిదర్శనం సోమవారం పుల్కల్ సంబంధించిన 108 వాహనం హైదరాబాదులోని నీలోఫర్ ఆసుపత్రికి వెళ్లి సాయంత్రం వరకు రాలేకపోయింది. ఇలాంటి పరిస్థితులు అత్యవసరమైన సమయంలో స్థానిక ప్రజలను ఎవరు కాపాడాలి వైద్యం ఎవరు అందించాలనేది పాలకులు ఒకసారి ఆలోచించాలి. ఇక్కడ రోడ్లు.. ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న 108 అందుబాటులో లేకపోవడంతో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇదే తరహాలో నాగలిగిద్ద మండలం మన్యు నాయక్ తండాలో ఓ మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుంది. తాండవాసులు 108 కు సమాచారం ఇచ్చారు. కానీ ఆ గ్రామానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో సిబ్బంది చేతులేత్తారు. స్థానికుల సహాయంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆసుపత్రికి తీసుకువస్తున్న క్రమంలోనే మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇలా వెళ్లేందుకు వీలున్న ప్రాంతానికి రోడ్లు లేవు.. రోడ్లు ఉన్న ప్రాంతానికి వాహనం లేకపోవడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది సాక్షాత్తు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్య వహిస్తున్న ఆందోళ నియోజకవర్గంలో పాటు మనసంత జిల్లాలో ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోవడం ఆయన పనితీరుకు నిదర్శనం.

## బీసీ సేనలో పనిచేసే వారికి ఉన్నత పదవులు

**బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ వెల్లడి**

**షాబాద్ మండల బీసీ సేన కమిటీ కార్యదర్శిగా బండ శివ నియామకం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ సేన రాష్ట్ర నాయకులు మహేందర్ గౌడ్**



ప్రజా వాయిస్,షాబాద్
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బీసీ సేన మండల కార్యదర్శిగా బండ శివను నియమించి నియామక పత్రం అందజేశారు బీసీలు ఐక్యతకు గ్రామ గ్రామాన బీసీ సేన కమిటీలు వేస్తూ కార్యక్రమాలను నిర్వహించుటలో ఉత్సాహం చూపుతున్నటువంటి యువతకు బీసీ సేనలో గౌరవ పదవులు ఇస్తామని జాతీయ అధ్యక్షులు బర్కత్ కృష్ణ వెల్లడించారు అదేవిధంగా ప్రతిబిసి బీసీల హక్కులను సాధించుకొని విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో రాణించే విధంగా పాత్ర పోషించాలన్నారు.ఈ కార్యక్రమంలో బిసి సేన మండల అధ్యక్షులు దయాకర చారి ఉపాధ్యక్షులు మిరంపల్లి బాలరాజ్ మండల యువజన అధ్యక్షులు బండా అజయ్ కుమార్ మాజీ సర్పంచులు లింగం, శ్రీనివాస్ గౌడ్, నాయకులు కుమ్మరి మాణిక్యం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### తాడూరు మండల పోలీస్ స్టేషన్‌లో

## ఘనంగా రక్షాబంధన్

**ఎస్సై కి రాఖీ కడుతున్న మహిళ కానిస్టేబుల్**

నాగర్ కర్నూల్, ప్రజా వాయిస్





తాడూరు మండల కేంద్రంలోనీ పోలీస్ స్టేషన్ లో సోమవారం రాఖీ పండుగ (రక్షాబంధన్)పర్వదినాన్ని పురస్కరించుకొని తాడూరు పోలీస్ స్టేషన్ లో రాఖీ పండుగ ను ఘనంగా జరుపుకున్నారు. మహిళా కానిస్టేబుళ్లు ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటారు.నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ" ఎల్లప్పుడూ తమకు రక్షణగా ఉండాలని కోరుతూ ఆత్మీయతను చాటుకున్నారు. పోలీసులు విధులు నిర్వహిస్తుండగా వారి వద్దకే తమ తోటి మహిళ పోలీస్ సిబ్బంది రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. పోలీస్ స్టేషన్లో రక్షాబంధన్ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.

## షాబాద్ మండలంలో భారీ వర్షం



ప్రజా వాయిస్,షాబాద్
షాబాద్ లో భారీ వర్షం కురుస్తోంది. మండలంలోని తాళ్లపల్లిలో 64.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించినట్లు తెలుస్తుంది. అలాగే జిల్లాలోనే మొదటి స్థానంలో తాళ్లపల్లి నిలిచినట్లు పేర్కొన్నారు.అటు చందనవెల్లిలో 43.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.మండలంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో వర్షం పడుతోంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారుని, వర్షం సమయంలో ఎవరు బయటకు రావద్దని, కరెంట్ స్తంబాల వంటి వాటి వద్దకు వెళ్ళవద్దని చూచించారు.

## గ్రీవెన్స్ డే లో పలు ఫిర్యాదుల పరిశీలిలన

**52మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



నల్గొండ, ప్రజా వాయిస్
ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ సోమవారం రోజున జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 52 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.

## అలుగు పారుతున్న నాగర్ కర్నూల్ కేసరి సముద్రం

నాగర్ కర్నూల్, ప్రజా వాయిస్
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం (చెరువు) ఆగస్టు నెలలో అలుగు పారడం వింతగా చూస్తున్న సందర్శకులు గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుండి ఉయ్యాలవాడ, నల్లవెల్లి గ్రామాల నుండి భారీగా వర్షపు నీరు చేరడంతో కేసరి సముద్రం (చెరువు) అలుగు పారడంతో సందర్శకులు ఒకవైపు ఆనందంతో మరోవైపు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో అయోమయంలో ఉన్నారు. భారీ వరద నీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



# తీజ్ పండుగ ముగింపు ఉత్సవాలు



**ప్రజా వాయిస్,మహబూబాబాద్**
మహబూబాబాద్ మండలంలోని బిచ్చ నాయక్ తండా,ఇస్లావత్ తండా సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని బిచ్య తండా లో తీజ్ పండుగ ఉత్సవాల ఘనంగా నిర్వహించడం జరిగింది ప్రతి ఇట్టి కార్యక్రమనికి ఇస్లావత్ తండా గ్రామ మాజీ సర్పంచ్,లంబాడి హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బోడా లక్ష్మణ్ నాయక్ తొమ్మిదో రోజు తేజ్ ఉత్సవాల్లో ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ లంబాడి సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ పండుగ ఎంతో పవిత్రమైనదని లంబాడి ఆడబిడ్డలు ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని ఇది లంబాడీల ఐక్యతకు నిదర్శనమని తండాలు ఎంతో సుభిక్షంగా ఉండాలని పంట పైరు ,పశు సంపద అన్నియు పచ్చగా ఉండాలని, ప్రతి ఒక్కరికి సకల సంపదలు కలగాలని ఉద్దేశంతో పండుగ గొప్పదమని ప్రాముఖ్యత ఉంటుందని,సోదరీ సోదరుల మధ్య సోదర భావంతో ఉండాలని ఆ భావాన్ని పెంపొందించే పండుగ నేటి కాలంలో ఇది ఎంతో ప్రాచీర్యం పొందిందని,రానున్న రోజులలో తీజ్ పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఏకధాటిగా చేసుకొని ఎక్కువగా ఈ తీజ్ పండుగను లంబాడీలు జరుపుకుంటారు కాబట్టి రాష్ట్రంలో ఒక ప్రాముఖ్యత కలిగినటువంటి ఈ తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తించాలని మాట్లాడారు.

# నులి పురుగులను నిర్మూలిద్దాం


## కార్పొరేటర్ మేకల సునీత



**మల్కాజిగిరి,ప్రజా వాయిస్**
నులి పురుగులతో పిల్లలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతుం అవుతుంటాయని వాటిని దూరం చేసి చిన్నారులను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు.కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ కార్యక్రమాన్ని మధుసూదన నగర్ లో గల విజయ మేరీ పాఠశాలలో నిర్వహించారు. కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, కడుపునొప్పి, ఆకలి లేక పోవడం, బలహీనత, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో విజయ మేరీ పాఠశాల కరస్పాండెంట్ భీష్మారెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఏఎన్ఎంలు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సిద్ధం చేయాలి

## కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**కామారెడ్డి,ప్రజా వాయిస్**
రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు తదితర ప్రభుత్వ ఆస్తుల వివరాలను వెంటనే తెలియజేయాలని విద్యుత్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో విద్యుత్, రెడ్కో శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలు, ఆస్పత్రులు, అంగన్వాడీ భవనాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ ఉత్పాదనకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. జిల్లాలో గల ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలు, ఆస్పత్రులు, అంగన్వాడీలను మండల స్థాయిలో ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈలు మండలంలో గల అన్ని ప్రభుత్వ ఆస్తులను సందర్శించి ఆయా సంస్థల భవనాలపై ఎండ పడే ప్రాంతాలను జాగ్రత్తగా కొలిచి వాటి వివరాలను సేకరించాలని, అదేవిధంగా ఆయా కార్యాలయాలు సంస్థలలో విద్యుత్ వినియోగం వివరాలను సేకరించి త్వరగా అందించాలని విద్యుత్ ఎస్ఈ శివకుమార్ ను ఆదేశించారు.

# మెడికల్ కళాశాల హాస్టల్స్ ప్రారంభించాలి




**ప్రజా వాయిస్,మహబూబాబాద్**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాలు వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంధసిరి జ్యోతి బసు,పట్ల మధు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ముందు సోమవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ మెడికల్ కళాశాల ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్న, విద్యార్థులకు కానీ హాస్టల్లో ఏర్పాటు చేయలేదని విమర్శించారు. హస్టల్ నిర్మాణాలు పూర్తి అయన ప్రారంబించక పోవడం ఏమిటని ప్రశ్నించారు.మెడికల్ కళాశాల భవనం సమస్యల వలయంగా మారిందని మండిపడ్డారు.కావున తక్షణమే జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ స్పదించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బానోత్ సింహాద్రి, ఎస్.ఏఫ్.ఐ పట్టణ అధ్యక్షు, కార్యదర్శులు భాషాపాక పవన్,గుండ్ల రాకేష్ పట్టణ నాయకులు మహేష్,వినోద్,ప్రవీణ్,యాకన్న ,ప్రమోద్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండ ఉంటుంది

## మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్ కర్నూల్,ప్రజా వాయిస్**
కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ముగింపుకు గురి అవుతున్న గ్రామాల నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు తోడు ఉంటుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కొల్లాపూర్ మంత్రి క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, రెవిన్యూ, సాగునీటిపారుదల అధికారులు ముంపుకు గురవుతున్న గ్రామాల నిర్వాసితుల తో పునరావాసం, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణాలు, తదితర అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్వాసితుల పునరావాసమే మా ప్రథమ ప్రాధాన్యత, ప్రభుత్వం వారిని జీవితంలో కొత్త వెలుగులతో ప్రారంభించేలా పూర్తిగా అండగా నిలుస్తుందని మంత్రి అన్నారు. పునరావాస కాలనీల్లో వసతి, నీరు, విద్యుత్, రహదారి, ఉపాధి, ఆరోగ్య సేవలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అధికారులు పునరావాస కాలనీల్లో పనుల పురోగతి, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై నివేదికలను మంత్రికి సమర్పించారు.ప్రాజెక్టులు సర్వం కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, తదితర అనుమతులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారం ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు అంశాల వారీగా మంత్రివర్యుల ఆదేశాలకు అనుగుణంగానే జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, ముంపు గ్రామాల ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి చేయాలని కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, పాలమూరు రంగారెడ్డి ప్రత్యేక భూసేకరణ అధికారి మధుసూదన్ నాయక్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, రెవిన్యూ, సాగునీటిపారుదల శాఖల అధికారులు, ముంపు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సారూ! కాపాడండి మహాప్రభో

### కొడుకూ కోడలే కాలయములయ్యారు

### ఆస్తి లాక్కున్నారు

### లేని ఎయిడ్స్ ఉందని నెపం పెట్టి గెంటేశారు

### గద్వాల కలెక్టర్ ఎదుట వృద్ధురాలి ఆవేదన

**ప్రజా వాయిస్,గద్వాల**
ఆస్తులు లాగేశారు! అవసరం తీరాక కొడుకూ కోడలే కాలయములయ్యారు. కంటికి పాపల కాపాడుకుంటారని ఆస్తినంతా కొడుకూ కోడలు రాసిందా వృద్ధురాలు. అయితే ఆస్తి దక్కినంక ఆమెతో ఆ కొడుకూ కోడలుకు ఆమెతో అవసరం తీరిపోయింది. దీంతో ఆమెను వీధిలోకి గెంటేశారు. అంతేకాక ఎయిడ్స్ ఉందని ప్రచారం చేశారు. తనకు ఏ జబ్బూ లేదని ఆ వృద్ధురాలు ఎంతో వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆ వృద్ధురాలు కలెక్టర్‌ను ఆశ్రయించింది. ఎవరూ తనను చేరదీయకుండా చేశారని ప్రజావాణిలో తనను కాపాడాలంటూ దీనంగా వేడుకుంది. ఈ ఘటన గద్వాల జిల్లాలో సోమవారం జరిగింది.జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ (80) సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కె.మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌కు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో.. తన రెండో కుమారుడు, కోడలు చిన్న ఇస్మాయిల్, సాభేరాభాను తనను బాగా చూసుకుంటానని నమ్మబలికి ఇంటికి తీసుకెళ్లాడని, రామాపురం శివారులోని కోడలు సాబేరా భాను పేరున 4%-%26 ఎకరాలను, జూలకల్ శివారులో కొడుకు చిన్న ఇస్మాయిల్ పేరున 2%-%03 ఎకరాలను, కోడలు సాబేరా భాను పేరున 2%-%03 ఎకరాలను శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ చేయించుకున్నారని, ఆస్తి రిజిస్ట్రేషన్ అనంతరం తన బాగోగులు చూడటం లేదని, మానసికంగా కృంగదీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు అంటరాని రోగం ఉందని, కనీసం తనకు ఎవరూ మంచినీరు కూడా ఇవ్వకుండా చేశారని పేర్కొన్నారు. ఆధార్ కార్డు లాక్కున్నారని, ఎవరినీ సంప్రదించకుండా తన ఫోన్ లాక్ చేసి పెట్టారని తెలిపారు. తనకు తెలియకుండా తులంన్నర బంగారాన్ని తీసుకున్నారని, సేవింగ్ అకౌంట్‌లోని డబ్బులను తనను వెంటతీసుకెళ్లి డ్రా చేసుకున్నారని, తనకు డబ్బులు ఇవ్వలేదని తెలిపారు.కావున తన ఫిర్యాదును విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. తన పేరున రిజిస్ట్రేషన్ అయిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి మళ్లీ తన పేరున భూమి నమోదు చేయాలని, తన ఇంటిలో వారు ఉండకుండా తన శేష జీవితం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సదరు కోడలు, కుమారునిపై తగు చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



# షీ లీడ్స్ నల్గొండ బిలీవ్స్ అనే నినాదంతో నూతన కార్యక్రమం

### నేర నియత్రణలో మహిళా పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలి

### జిల్లా ఎస్.పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్




**నల్గొండ,ప్రజా వాయిస్**
నేర నియంత్రణలో బాగంగా మహిళా పోలీస్ సిబ్బంది అన్ని విధులు నిర్వర్తించడానికి సిద్ధంగా ఉండాలనీ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న మహిళా పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న డ్యూటీలు, వారికి ఎదురయ్యే సమస్యలు, పురుష సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తే ఎదురయ్యే సమస్యలు,కుటుంబ తరుపున సమస్యల పై అడిగి తెలుసుకోనీ షీ లీడ్స్ నల్గొండ బిలీవ్స్ అనే నినాదం తో నూతన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళ సిబ్బంది పోలీస్ స్టేషన్ లలో రిసెప్షన్, రికార్డు వర్క్, సీసీటీన్స్, టెక్ టీమ్, ఇతర పోలీస్ స్టేషన్ లో విధులతో పాటు బయట డ్యూటీ లు కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రాం, బ్లూ క్లోట్స్, నైట్ పెట్రోలింగ్, పిటిషన్ ఎంక్వయిరీ, కోర్ట్ డ్యూటీ, సమాన్స్, మెడికల్ డ్యూటీ, వెహికల్ చెకింగ్, క్రైమ్ డ్యూటీ లు, ఎస్కార్ట్ డ్యూటీ, ట్రాఫిక్ డ్యూటీ లు, బందోబస్త్ డ్యూటీ లు మెన్ తో సమానంగా విధులు నిర్వహించాలని సూచించారు. మహిళా సిబ్బంది కి సెల్ఫ్ డిఫెన్స్ పైన శిక్షణ ఏర్పాటు చేయాలి అని అధికారులకు సూచించారు. ఈసమావేశంలో ఎఎస్పి మౌనిక ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్.బి సీఐ రాము, డబ్ల్యూపిఎస్ సిఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్,సబ్ ఇన్స్పెక్టర్ లు, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు పార్లమెంట్లో చట్టం చేయాలి

## సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం




**నల్గొండ,ప్రజావాయిస్**
తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్లో చట్టం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ సందర్భంగా హాశం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలో కులగలన చేపట్టి 56% ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని అన్నారు పార్లమెంటులో ఆమోదింపజేసి చట్టం చేయడానికి బిజెపి నిర్లక్ష్య ధోరణి అవలం బిస్తుందని ఆరోపించారు మైనార్టీలకు రిజర్వేషన్లు వర్తింపచేస్తున్నారని కుంటి సాగుతూ ఆపడం సరికాదని అన్నారు ముస్లింలలో దూదేకుల ఫకీరు రాయి కొట్టే కాశవారు అనేక సంవత్సరాలు నుండి బీసీలుగా ఉన్నారని అన్నారు వారిని బుచిగా చూపించి బీసీలకు రిజర్వేషన్లు లేకుండా చేయాలని కుట్ర బీజేపీ చేస్తుందని ఆరోపించారు తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర మంత్రులు పార్లమెంట్ సభ్యులను నిలదీయాలని పర్యటన సందర్భంగా అడ్డుకోవాలని పిలుపుని చ్చారు బిజెపి తమ ద్వంద వైఖరి మానుకొని ఇప్పటికైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ఏకపక్షంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలన్నింటినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పట్టణ కమిటీ సభ్యులు గాదె నరసింహ దండెంపల్లి సరోజ అవుట రవీందర్, నాగరాజు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దళిత వాడలు సమస్యలకు నిలయాలు

## కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్



**నాగర్ కర్నూల్,ప్రజా వాయిస్**
దళిత వాడలు సమస్యలకు నిలయాలుగా మారాయని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ అన్నారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో బిజినపల్లి మండలంలోని పోలేపల్లి గంగారంలో గ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి ఎన్ని సంవత్సరాలు గడుస్తున్న కనీసం నిలువలు నీడలేని పరిస్థితులలో దళితులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు దళితవాడలో కనీసం డ్రైనేజీ సిసి రోడ్లు లేవని అన్నారు. దళితవాడలలో సీసీ రోడ్లపై వెళుతుందని అన్నారు. వర్షాకాలంలో ఈగలు ఎక్కువ అయ్యి అనారోగ్య పాలు అవుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కూడా అర్హులైన వారందరికీ అందలేదని కొన్ని కుటుంబాలు పూరి గుడిసెలలో ఉంటున్నాయని కమ్యూనిటీ హాళ్లలో ఉంటున్నారని అన్నారు అధికారులు కూడా పౌర హక్కుల దినాన్ని జరిపించడం లేదని అన్నారు. దళిత కాలనీల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హనుమంతు చంద్రశేఖర్ శ్రీనివాసులు జంపులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.